


# ఫారిన్ వెళ్ళాల(న)ండి

## - వసుంధర



*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – ‘మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?’ అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో ‘పీజీ టు కేజీ’ గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది ‘బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే’లో తొలివిడతగా ‘ఫన్ నేనొక్కడినే’. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే
## చివరి విడత: మలి సందడి (30)

### బెర్లిన్లో భక్తలీల

**పాశ్చాత్యులైన** తెల్లవారు హేతువాదులని నేననుకుంటాను. వారు ఏదైనా మతాన్ని స్వీకరించినా, జీవనసౌలభ్యానికో లేక మనశ్శాంతికో. కొన్ని సంప్రదాయాలు పాటించినా, మూఢవిశ్వాసాలకి లోనవరు. సత్యాన్వేషణకే ప్రాధాన్యమివ్వడంవల్ల, దైవభక్తి వారి దైనందిన జీవితంలో భాగం కాదు. వారి దృక్పథం కూడా ఆధ్యాత్మికం కాదు, భౌతికం.

ఇక బాబా వంటి సమకాలీన ప్రత్యక్షదైవాల విషయానికొస్తే – వారి మానవాతీతశక్తుల్ని దైవత్వంగా భావించరు. ఐతే కుతూహలం వారిని ఉపేక్షించనివ్వదు. అవగాహనకోసం ప్రయత్నిస్తారు. అందుకు శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరిస్తారు.

ఈ విధంగా వారిది ఉత్తమస్థాయి ఆలోచన అనీ, మన దేశంలో చాలామంది ఈ విషయంలో వారిని అనుసరించాలనీ అనుకుంటూ – నా వంతు ప్రయత్నం నేను చేస్తుంటాను.

ఐతే సత్యసాయిబాబా అనుచరుల్లో పాశ్చాత్యులైన శ్వేత జాతీయులు ఎక్కువగానే ఉన్నారని తెలిసేక సందిగ్ధంలో పడ్డాను.

బాబాలో దైవత్వముందా, లేక ఆ తెల్లవారు కూడా సామాన్యతలో మనకు తీసిపోరా?

ఈ ప్రశ్నని రావుగారు నాలో రేకెత్తించారు. ఆయన ఇచ్చిన మాన్ ఆఫ్ మిరకిల్స్ పుస్తకంలో – ఆ ప్రశ్నకు జవాబు దొరకొచ్చునేమో!

హోవార్డ్ మర్ఫెట్ పాశ్చాతుడు. తెల్లవాడు. ఆపైన రచయిత కూడా.

అతడేం రాసి ఉంటాడోనన్న కుతూహలంతో ఆ పుస్తకాన్ని చదివాను. చదివితే చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది.

అది మన పురాణకథల్లో భక్తుల చరిత్ర పంథానే అనుసరించింది.

మర్ఫెట్ బాబా గురించి విన్నాడు. ఆయన్ని దేవుడని నమ్మలేదు. పరిశోధనాత్మక దృష్టితో ఇండియా వెళ్లేడు. బాబా గార్ని కలిశాడు. తన భావనలు వినిపించాడు. ఆయన ఆశ్రమంలో చోటు సంపాదించాడు. ఆ సాహచర్యంలో ఎన్నో మహిమలు చూశాడు. అవి అద్భుతాలేనని నిర్ధారించాడు. ఆయనకు భక్తుడయ్యాడు. ప్రచారకుడయ్యాడు.

అందులో బాబా ఏయే తేదీల్లో ఏయే మహిమలు ఎప్పుడెప్పుడు చూపాడో వివరాలిచ్చాడు. అవి అద్భుతాలేనని పాఠకుల్ని ఒప్పించేంత గొప్ప రచనాశైలిని ప్రదర్శించాడు.

ఇంకా నాకు తెలియని మరికొన్ని విశేషాలున్నాయి. అప్పటికే తన దైవత్వాన్ని కోట్లాదికి నిరూపించుకున్న షిర్డీ సాయిబాబాయే సత్య సాయిబాబాగా పునర్జన్మ ఎత్తేడట. అందుకు తగినన్ని సాక్ష్యాధారాలూ ఆ పుస్తకంలో ఉన్నాయి.

ఆ వివరాలు ఎప్పటికప్పుడు శ్రీమతితో పంచుకునేవాణ్ణి. చదవడం పూర్తయ్యేక, "సత్యసాయిబాబా భగవంతుని అవతారమా కాదా అన్నది పక్కన పెడితే – ఈ రచయితలో నిజాయితీ ఉంది" అన్నానామెతో

"నాకిక సందేహం లేదు. ఆయన దేవుడేనండీ" అంది శ్రీమతి.

"దేవుడైతే మనకేమిటి? కాకపోతే మనకేమిటి? మనవరకూ మాత్రం కోరికలు తీర్చుకుందుకు ఇప్పటికున్న రాముడూ, కృష్ణుడూ, శివుడూ వగైరాలు చాలరా?" అన్నాను.

“ఇంతమంది దేవుళ్లని పూజిస్తున్నాం. వాళ్లలో ఈయన్నీ కలుపుకుంటే నష్టమేముంది?” అంది శ్రీమతి.

“నష్టం కాదు. లాభం చూసుకోవాలి. రాజకీయనాయకులు కూడా కొత్త పార్టీలో కలిసేముందు లాభం చూసుకుంటారు” అన్నాను.

“ఐతే ఏంచేస్తారు?”

“ఒక లాటరీ టికెట్ కొంటాను. ప్రైజొచ్చిందీ, ఇకమీదట ఆయనే మన దేవుడు” అన్నాను.

శ్రీమతి నవ్వేసింది కానీ, నేను నిజంగానే లాటరీ టికెట్ కొన్నప్పుడు ఆశ్చర్యపోయింది.

కొని ఊరుకున్నానా, లేదు. ఆ టికెట్ భద్రపర్చడానికి ఇంట్లో ఓ పవిత్రమైన స్థలాన్ని సూచించమని శ్రీమతికి చెప్పాను.

ఆమె కొంచెం ఆలోచించి, “మనింట్లో పవిత్రస్థలమా? అది చర్చించి తేల్చాల్సిన విషయం” అంది.

ఆమె ఆ మాట ఊరికే అనలేదు.

మా ఇంట్లో కిచెన్ కామన్. మాతో పాటు ఇంటామె ఒలోముచ్‌కీ కూడా వాడుతుంది కాబట్టి, అక్కడ పవిత్రతకి ఆస్కారం లేదు. అందుక్కారణం ఆమె మ్లేచ్ఛజాతికి చెందినదని కాదు. పుట్టుకను బట్టి, అలవాట్లను బట్టి మనుషుల పవిత్రతను అంచనా వెయ్యడం కుసంస్కారమని నమ్మేవారిలో ప్రథముణ్ణి కావాలనుకునేవాణ్ణి, అలాంటి భావనకు తావిస్తానా!

నేను కోరే పవిత్రత శుచి శుభ్రాలకు సంబంధించినది.

ఒలోముచ్‌కీ స్నానమే నెలకొకటి రెండు సార్లో చేస్తుంది. వంటింట్లో తను వచ్చి వెళ్లిన గుర్తులన్నీ వదిలి వెడుతుంది. అందుకని వంటింట్లో ఆ టికెట్ ఉంచలేం.

బాత్రూం విషయానికొస్తే అది మనుషుల్ని పవిత్రులుగా చెయ్యడానికే తప్ప, పవిత్రమైన వాటిని ఉంచడానికి అనువైన స్థలం కాదు. ఆపైన అసలే కోతి అన్నట్లు, అక్కడ టబ్బుతో పాటు కమోడ్ కూడా ఉంది.

ఇక మేముండే గది. అక్కడ టీపాయ్ ఒకటుంది కానీ, అదే భోజనాల బల్ల కూడా! ఎంత జాగ్రత్తగా తిన్నా, కనీసం పిల్లలు తిన్నప్పుడైనా ఎంతోకొంత ఎంగిలి అంటుతుంది. భోంచేస్తున్నప్పుడల్లా ఆ బల్ల ఖాళీ చెయ్యక తప్పదు.

మరో ఫర్నిచర్ మంచం. దానికీ అరలూ అవీ లేవు. పవిత్రంగా భావించేవాటిని పరుపుకింద పెట్టుకోవచ్చు కానీ, ఆ తర్వాత పరుపుమీద పడుకుంటే ఆ పవిత్ర వస్తువుల్ని అవమానించినట్లే కదా! అదీకాక తరచుగా కాకపోయినా, అప్పుడప్పుడు బాబుకి పక్క తడిపే అలవాటింకా ఉంది.

ఉన్నట్లుండి అన్నాను, “మనం పనికొచ్చేవాటిని వెతుకుతున్నట్లు లేదు. పనికిరానివాటిని గుర్తిస్తున్నాం”.

“మీకలా అనిపించిందా, నాకైతే, మనమింతవరకూ ఈ గదిలో దేవుడి బొమ్మయినా పెట్టుకునే ప్రయత్నమే చెయ్యలేదని” అంది శ్రీమతి.

అదీ నిజమే.

వచ్చినప్పట్నించీ ఇంతవరకూ ఇంట్లో ఎక్కడైనా దేవుడి బొమ్మ పెట్టుకుని రోజూ దణ్ణం పెట్టుకోవాలన్న ఆలోచనే మాకు రాలేదు. మా దినచర్య హడావుడిలో ఆ విషయం స్ఫురించనూ లేదు.

భువనేశ్వర్లో శ్రీనివాసరావు గారు తనకి యూనివర్సిటీ క్వార్టర్సు రాగానే – ముందుగా తను నమ్మిన దేవుడికి ఏ గది కేటాయించాలా అని ఆలోచించారు. ఉన్నంతలో పెద్ద గదిని దేవుడికిచ్చి, మిగతాభాగంలో తనూ తన కుటుంబం సద్దుకున్నారు. అదీ భక్తి!

మరి మాకసలు దేవుడి ఆలోచనే రాలేదు. బెర్లిన్ రావుగారి పరిచయభాగ్యంతో ఇప్పుడా ఆలోచనొచ్చింది.

రావుగారు స్ఫురించగానే, “ఔనూ, రావుగారిచ్చిన కాసెట్టూ, పుస్తకం ఎక్కడ ఉంచుతున్నాం?” అనడిగాను.

వెంటనే శ్రీమతి అక్కడున్న టేపు రికార్డరు బల్లవైపు చూసింది.

మాటవరుసకు అడిగాను కానీ నాకుమాత్రం జవాబు తెలియకనా?

మా గదిలో ఎత్తైన పాతకాలం నాటి బల్ల ఉంది. ఉపరితలం ఎగుడు దిగుడుగా ఉన్నా వైశాల్యం కాస్త పెద్దదే!

దానిమీదనే మా రేడియో–రికార్డరు, స్పూల్ టైపు స్టీరియో టేపు రికార్డరు ఉన్నాయి. ఆ బల్ల సొరుగులో టేపులు, కాసెట్లు, రికార్డరుకి తగిన అనుబంధ పరికరాలు ఉన్నాయి, ఆ టేపుల్లో ఇండియన్సు నుంచి తెచ్చుకుని రికార్డు చేసుకున్న బాబీ, ప్యాసా, తీస్రీ మంజిల్, తలాష్, మేరానామ్ జోకర్ వగైరా హిందీ సినిమా పాటలు, కొంత పాశ్చాత్య సంగీతం ఉన్నాయి. ఇంకా ఘంటసాల ప్రైవేటు రికార్డులు ఉన్నాయి. కాళీ టేపులూ, పర్సనల్ రికార్డింగ్సూ కూడా చాలా ఉన్నాయి.

రావు గారిచ్చిన టేపుని ఆ సొరుగుల్లో వాటి మధ్య పెట్టడం సబబు కాదంది శ్రీమతి. పుస్తకాన్ని టేపు రికార్డరు పక్కన పెట్టి, దానిమీద బాబా పాటల కాసెట్ ఉంచింది. తను చెప్పదు, నేనడగను కానీ – రోజూ లేవగానే ఓసారి వాటికి చేతులు జోడిస్తోందని నా అనుమానం.

చదవడానికి పుస్తకాన్ని అక్కణ్ణించే తీసి, చదవడం ఆపగానే మళ్లీ అక్కడే ఉంచుతున్నాను. ఐతే అదో పవిత్రస్థలమని ఇప్పుడీ చర్చలయ్యేదాకా స్ఫురించలేదు. ఏదేమైనా మా గదిలో పవిత్రతకి కేటాయించిన స్థలమొకటి ఉంది.

లాటరీ టికెట్టుని శ్రీమతికి అందించి, "దీని విలువ మిలియన్ మార్కులు. మన జీవితాల్ని మార్చే శక్తి ఉన్న ఈ టికెట్టులో ఇప్పుడు లక్ష్మి అంశ ఉంది. మనస్ఫూర్తిగా దేవుణ్ణి నమ్మే నీకు మాత్రమే ఈ టికెట్టుని పవిత్రస్థలంలో ఉంచే అర్హత ఉంది" అన్నాను.

శ్రీమతి టికెట్ అందుకుని కళ్లకద్దుకుంది. రావుగారిచ్చిన పుస్తకంపైన దాన్నుంచి కాసెట్టుని ఒత్తుగా పెట్టి ఓసారి చేతులు జోడించి, నన్నూ దణ్ణం పెట్టుకోమంది.

"అబ్బా, మిలియన్ మార్కులనగానే ఎంత ఆశో! నువ్వు పెట్టిన దణ్ణం చాలదనా, నన్ను కూడా పెట్టుకోమంటున్నావ్!" అన్నాను నవ్వుతూ.

"ఏదో వంకన ఈ గదిలో — మనం దైవప్రార్థన చేసుకునేందుకో చోటు దొరికిందన్న ఆనందం నాది. నేను దేవుడికి భక్తితో దణ్ణం పెట్టాను. మిలియన్ మార్కుల ఆశ మీది. అది తీరాలంటే, మీ దణ్ణం మీరే పెట్టుకోవాలి" అంది శ్రీమతి.

చురక పడింది నాకు. ఐనా చలించక, "మిలియన్ మార్కులమీద నీకు లేదా ఆశ!" అన్నాను.

"ఆశ అని మీరే అన్నారుగా. ఆశపడ్డానికి మనకిప్పుడేం తక్కువైందని! అన్నీ ఉన్నాయి. అంతా బాగుంది. మనం కలిసున్నాం" అందామె.

ఆడవాళ్లు అల్పసంతోషులు. అది తెలిసి కూడా వాళ్లని సంతోష పెట్టే ప్రయత్నం చెయ్యరు మగాళ్లు!

"ఐతే నాదణ్ణం నేనే పెట్టుకోవాలంటావ్?" అంటూ గొంతు సవరించుకున్నాను. చేతులు జోడించి, "లాటరీలో నాకు, ఒక మిలియను మార్కు, లివ్వాలి తప్పదు శ్రీ సత్యసాయీ" అని అప్పటికప్పుడు ఓ పాట కల్పించి రాగయుక్తంగా పాడేసరికి పక్కన బొమ్మల పజిల్సు పూర్తి చేస్తున్న పిల్లలు చటుక్కున నా పక్కకొచ్చారు.

పిల్లలకు మనోరంజకంగా ఉండాలని, తెలిసిన కొన్ని పాటలకి పేరడీలు రాసి నాకొచ్చిన వరసలో పాడుతూండడం నాకు అలవాటే! అలాంటప్పుడు పిల్లలు ఉత్సాహపడి నా పక్కకొచ్చి నాతో గొంతు కలుపుతుంటారు.

ఇప్పుడూ అదే జరిగింది.

"పాడుతున్నట్లు లేదు. భజన చేస్తున్నట్లుంది" అంది శ్రీమతి.

"భజన భక్తిపథం" అన్నాను.

"భక్తి అంటే ఇదా? ఓ టికెట్ కొని దానికి ప్రైజు రావాలని దేవుణ్ణి కోరడం ఆశ, లేక స్వార్థమూనూ. పైగా ఇవ్వాలి తప్పదు – అని నొక్కించడం కూడానూ....." అని నవ్వింది శ్రీమతి.

"భక్తులెప్పుడూ దేవుణ్ణి ఇలాగే అడుగుతారు. పరమభక్తుడైన రామదాసు కూడా, 'ఏ తీరుగ నను దయ చూసెదవో' అని భగవంతుణ్ణి వేడుకున్నాడు. నేనిప్పుడా దశలో ఉన్నాను. ఎప్పటికీ దయ చూపకపోతే, 'ఎవడబ్బ సొమ్మని కులుకుచు తిరిగేవు' అని నిలదీశాడు. ఇంకా నేనా దశకు చేరుకోలేదు" అన్నాను.

"భక్తరామదాసుకీ మీకూ పోలికా? ఆయన దేవుడికోసం బోలెడు డబ్బు ఖర్చు చేసి అప్పులపాలై అవి తీర్చలేక జైలు పాలై కఠినశిక్షలకు ఓర్వలేక ఆ మాటలన్నాడు" అంది శ్రీమతి.

"అదే చేతులు కాలేక ఆకులు పట్టుకోవడమంటే! దేవుడేమైనా ఆయన్ని నగలు కావాలని అడిగేడా? చేయించేక వాటికైన ఖర్చు, 'నీ తండ్రి దశరథ మహారాజు పెట్టెనా, లేక నీ మామ జనక మహారాజు పంపెనా' అని నిష్ఠూరమాడ్డమెందుకూ! నేనైతే ముందుగానే దేవుణ్ణడిగి తీసుకుని అప్పుడు అందులో కొంత ఆయనకోసం ఖర్చు చేస్తాను. ఇప్పుడైనా దేవుణ్ణి తన జేబులోంచి తీసి ఇమ్మన్నానా? లాటరీవాళ్లు ఎవరికో ఒకరికిచ్చే డబ్బు నాకొచ్చేలా చెయ్యమన్నాను. అదీ ఇండియా డబ్బు కాదు. జర్మనీది. ఇంత మంచి డీల్ ఏ భక్తుడైనా ఇస్తాడా?" అన్నాను.

"భక్తుడికి దేవుడితో డీల్స్ ఉండవు. మీకు దేవుడంటే వేళాకోళంగా ఉన్నట్లుంది. అది తప్పు. మీరు నిజంగా దేవుడికి ఏమైనా చెయ్యాలనుకుంటే, స్వయంకృషిని నమ్ముకోండి. లాటరీ టికెట్లని కాదు" అందామె.

"నేనెందుకు భక్తుణ్ణి కాదో నాకు తెలియడం లేదు. నీకిప్పుడు మన పురాణాల్లో కొందరు గొప్ప భక్తుల గురించి గుర్తు చేస్తాను" అన్నాను.

గజేంద్రుడు. కొలనులో చేరి తన భార్యలతో జలక్రీడలాడుతూ, ఓ మొసలి తన కాలు పట్టుకుంటే తనొక్కడే పోరాడేడు. తక్కిన ఏనుగులు తక్కువవా? అన్నీ కలిసి ఆ మొసలిని హతమార్చలేవా? కానీ గజేంద్రుడు రక్షించే బాధ్యతని దేవుడికి అప్పజెప్పాడు.

అలాగే ప్రహ్లాదుడు. తను విష్ణుభక్తుడు. తండ్రి హిరణ్యకశిపుడు శివభక్తుడు, విష్ణుద్వేషి. శివకేశవులొక్కరే అని పురాణాలన్నీ ఘోషిస్తున్నాయి కదా – తనూ విష్ణువుని కూడా శివుడిలోనే చూసి ఆయన్నే ప్రార్థిస్తే ఏ గొడవా లేదుగా! కానీ తను తండ్రి మాట వినలేదు. పోనీ అని తండ్రి కష్టాలు పెడుతుంటే భరించి ఊరుకున్నాడా? రక్షించాల్సిన బాధ్యతని విష్ణువు కప్పగించాడు. ఇంతకీ హిరణ్యకశిపుడికి అంత బలాన్ని ఎవరిచ్చారు? విష్ణువు కుమారుడైన బ్రహ్మదేవుడే. ఆ వరాల్నయినా గౌరవించి తండ్రి మాట వినొచ్చుగా, లేదు!

నా విశ్లేషణ విని శ్రీమతి చిరాగ్గా మొహం పెట్టి, "మన పురాణాలకి ఇలా పెడర్థాలు తీసేవాళ్లు, పురాణకాలంనుంచే ఉన్నారు. అవేమీ నిలబడలేదు. పురాణాలే నిలబడ్డాయి. ఆ విషయం గుర్తుంచుకోండి. ఇంతకీ మీరు నాకు ఇవన్నీ ఎందుకు చెబుతున్నట్లు?" అంది.

"అలాగడిగావు, బాగుంది. ఇందాకా అన్నావు కదా, నాకు దేవుడంటే వేళాకోళంగా ఉందని. అది పొరపాటు. భక్తుల్నీ, భక్తి సిద్ధాంతాన్నీ ప్రశ్నించి చిన్నబుచ్చడం నా ఉద్దేశ్యం కాదు. నాది ఆత్మరక్షణ అని తెలుసుకో" అన్నాను.

"ఆత్మరక్షణా? ఇప్పుడు మీకా అవసరమేమొచ్చింది?"

"రామదాసైనా, గజేంద్రుడైనా, ప్రహ్లాదుడైనా – వాళ్లందరికీ ఉన్న కామన్ పాయింటు ఒక్కటే! వాళ్లు భక్తులు. వాళ్లకే కోరికలూ లేవు. వారు పడ్డ కష్టాలన్నీ వారు కొనితెచ్చుకున్నవే. ఏ కష్ట,మొచ్చినా భరించే శక్తి వారికుంది. అందుకే వారు సాహసాలు చేశారు. తమ సమస్యకు సులభ పరిష్కారం తమ దగ్గరే ఉన్నప్పటికీ, ఆ బాధ్యతను భగవంతుడికే వదిలిపెట్టడం వారి లీల. మనం దైవలీల అనుకుంటున్నది నిజానికి భక్తలీల. ఆ లీలవల్ల భక్తులకు కొత్తగా ఒరిగిందేం లేదు. దేవుడి ప్రతిష్ఠ మాత్రం పెరిగింది" అన్నాను.

శ్రీమతి అబ్బురంగా నన్ను చూసి, "ఇదో కొత్త వ్యాఖ్యానం. మీరు చెబుతుంటే ఇదే నిజమనిపిస్తోంది" అంది.

"నేనెప్పుడూ నిజమే చెబుతాను. 'పరిత్రాణాయ దేవానాం, వినాశాయచ దుష్కృతామ్, భక్తి సంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే' అన్న మాట దేవుడిది కాదు. భక్తుడిది! ఉన్నవాళ్లు చాలరని, నేనో కొత్త దేవుణ్ణి నమ్మాలంటే తగిన కారణం చూపాలిగా! అదే ఆత్మరక్షణ. కాబట్టి నేనిప్పుడు లాటరీ టికెట్ కొనడం స్వార్థం కాదు. భక్తలీల. లాటరీ తగిలిందీ, పాత దేవుళ్లకివ్వడానికి సంజాయిషీ ఉంటుంది. కొత్త దేవుడి ప్రతిష్ఠ పెరుగుతుంది. హోవార్డ్ మర్ఫెట్ తన పుస్తకానికి కొత్త ఎడిషన్లో, నా కథ కూడా చేరుస్తాడు. ఒకవేళ మనకి ప్రైజు రాలేదనుకో, జస్ట్ యాభై ఫెన్నిగ్గు నష్టం, అంతే!" అన్నాను.

"అలాగైతే ముందు మీరు పాటలు రాసి పొద్దం కాదు. రావుగారిచ్చిన కాసెట్లో పాటలు మన టేపులోకి మార్చే పని ముందు మొదలెట్టండి. రావుగారికా కాసెట్ ప్రాణం. అది వీలైనంత తొందరగా ఆయనకిచ్చెయ్యాలి మరి. అదలాగుంచితే, ఆ పాటలు మనింట్లో ప్లే ఔతుంటే మనకు అదనపు పుణ్యం కదా!" అందామె.

నేను తల అడ్డంగా ఆడించాను, "మనం రావుగార్ని కలుకునేటందుకు కనీసం పది రోజుల వ్యవధి ఉంది. లాటరీ ఫలితాలు ఈలోగానే వస్తాయి. అవొచ్చేకనే రికార్డింగు" అన్నాను దృఢంగా.

ఎదుటి వ్యక్తి కాస్త మూర్ఖంగా వ్యవహరిస్తున్నాడనుకున్నప్పుడు, అందువల్ల జరగబోయే ప్రమాదమేదీ లేదని నమ్మకమున్నప్పుడు — వాదన పెంచకపోవడం, తన పాయింటు నొక్కించకపోవడం అరుదైన గొప్ప లక్షణం. అది శ్రీమతికుంది.

ఆ తర్వాత మూణ్ణాలుగు రోజులు మా ఇంట్లో రోజూ ఉదయం లేవగానేనూ, రాత్రి పడుకునేముందూనూ – నేను, పిల్లలు ఏకకంఠంతో 'లాటరీలో నాకు, ఒక మిలియను మార్కు, లివ్వాలి తప్పదు' అంటూ — భజన చేసేవాళ్లం.

ఫలితాలు వచ్చాయి. నా ఆరు నంబర్లలో ఒక్కటి కూడా డ్రాలో రాలేదు.

"ఆయన కొందరికి వజ్రపు టుంగరాలు గాల్లోంచి తీసిచ్చాడని విన్నాను. మన భక్తి ఆయనకు చాలినట్లు లేదు. ఇంతకంటే ఎక్కువ భక్తి చూపడం నావల్ల కాదు. పోనీలే, నాకాయన భక్తకోటిలో చేరాల్సిన మొహమాటం తప్పింది" అన్నాను శ్రీమతితో నవ్వుతూ.

నేనేమీ నిరుత్సాహపడలేదని శ్రీమతికి అర్థమైంది. తనూ తేలికగా నిట్టూర్చి, "ఈ మాట రావుగారితో అనేరు" అంది.

అననని తనకీ తెలుసు. అందుకని నేనూ ఆ విషయమై హామీ ఇవ్వలేదు కానీ ఇంకేదో చెప్పబోతుంటే ఆమె ఆపి, "ముందు రికార్డింగు పని మొదలెట్టండి. ఆయన కాసెట్ ఆయనకి వీలైనంత త్వరగా వెనక్కివ్వడం ముఖ్యం" అంది.

ఆతర్వాతి ఆదివారం ఉదయం రేడియో రికార్డర్ని స్పూలుకి కనెక్ట్ చేసి, రికార్డింగు మొదలెట్టి ఎవరి పనులు వాళ్లు చేసుకుంటున్నాం.

ఆ గదిలో 'గోవింద హరే గోపాల హరే జయ గోపి గోపబాలా' అంటూ బాబాగారి కంఠస్వరం పలికింది.

అది మామూలు స్వరం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సంపన్న దేశాల పౌరుల్ని కూడా ప్రభావితుల్ని చేస్తున్న వ్యక్తి కంఠస్వరం.

కాసేపు అబ్బురంగా విన్నాను.

"ఇది వినడం నిజంగా మన అదృష్టం. రావుగారికి థాంక్స్ చెప్పుకోవాలి" అన్న శ్రీమతి మాటలు వినేదాకా నేనీ లోకంలో లేను. ఆమె మాటలు వింటూనే ఉలిక్కిపడ్డాను. అది గమనించినట్లుంది, "చూసేరా, ఆగొంతు వింటూ మీరు కూడా మైమర్చిపోయారు. ఇది భక్తలీల అంటారా, భగవల్లీల అంటారా?" అంది.

తనలా అనగానే నాలో కొద్దిగా అహం రేగింది, "ఇందులో దైవలీల ఏముంది? గజేంద్రుణ్ణి కాపాడ్డానికి విష్ణువు స్వయంగా వచ్చి మొసలిని చంపలేదూ! అలా దేవుడు నాకు లాటరీలో మిలియన్ మార్కులొచ్చేలా చేస్తే అదీ దైవలీల! అందుకని ఓ లాటరీ టికెట్ కొని నేనాయనకో అవకాశమిచ్చాను. ఆయన ఉపయోగించుకోలేదు" అన్నాను.

"చాలా ఆశ మీకు. ఏదో మామూలు ప్రైజూ కాదు, ఏకంగా మిలియను మార్కులు కావాలి మీకు! నాకు తెలుసులెండి, మీరిలాంటివి నమ్మరు. కానీ నేను నమ్ముతానని అపోహుంది మీకు. మీరాడిన లాటరీ టికెట్ డ్రామా, నాకోసం. అది డ్రామా అనెందుకంటున్నానంటే, లాటరీ ఫలితాలు వచ్చేక ఉక్రోషం లేదు, రవంతైనా నిరుత్సాహం లేదు. ఓ మాటంటాను, ఏమనుకోకండి! మనలో మనకిది సరదా కావచ్చు కానీ, ఇలా కొందరి నమ్మకాన్ని ఎగతాళి చెయ్యడం తప్పు" అంది శ్రీమతి.

అప్పుడు శ్రీమతి మొహం చూస్తే – ఏదైనా తప్పు చేసినప్పుడు హెచ్చరించే అమ్మ గుర్తుకొచ్చింది.

సంజాయిషీ ఇవ్వడం బాధ్యత అనిపించి, "మన జోలికి రానప్పుడూ, ఇతరులకి నష్టం కలిగించనప్పుడూ – ఎవరి నమ్మకాన్నీ ఎగతాళి చెయ్యకూడదని నా సిద్ధాంతం కూడా! ఐతే మనలో మనం మాట్లాడుకునేటప్పుడు, తోచిన మాటలు చెప్పడానికి వెనుకాడకూడదు. లేకుంటే మన భావాల్ని ఎవరితో పంచుకుంటాం?" అన్నాను.

"ఐతే రికార్డింగు ఐపోయేక, ఒకసారి మన టేపులో కూడా బాబాగారి గొంతు విందాం" అంది శ్రీమతి.

"అబ్బా, గొంతు అనకు. పాట అను" అన్నాను.

"రెంటికీ తేడా ఏంటి?"

"గొంతు అనగానే రఫీ, ఘంటసాల వగైరాలు గుర్తుకొస్తారు. నా సంగతి నీకు తెలుసుగా, గొంతుకు చాలా ప్రాధాన్యమిస్తానని!" అన్నాను.

నాకు మృదువుగా, సాఫీగా సాగే గొంతులు ఇష్టం. చిన్నప్పుడు రేడియో సిలోన్లో ఉదయం ఏడున్నరనుంచి ఓ అరగంట సేపు మరీ పాత హిందీ సినిమా పాటలు వేసేవారు. అందులో గొంతులు మృదువుగా అనిపించక, ఆ కాసేపూ రేడియో కట్టేయాలనుకునేవాణ్ణి. కానీ మా అన్నయ్య నామీద పంతంకొద్దీ రేడియో కట్టనిచ్చేవాడు కాదు. అప్పుడు మేమిద్దరం కలిసి ఓ అవగాహనకి వచ్చాం. ఆ వరసలో చివరి పాట కెయల్ సైగలుది. అప్పట్లో నాకా గొంతు గేదె దూడ అరిచినట్లు అనిపించేది. అందుకని ఏడూ యాభైఐదుకి రేడియో కట్టేసి మళ్లీ ఎనిమిదికి పెట్టుకునేవాళ్లం. ఆ టైమొచ్చేసరికి రేడియోకి ఎంత దూరంలో ఉన్నా, ఏదో కొంప మునిగిపోయినట్లు ఉరకలు పరుగులమీద వెళ్లి కట్టెయ్యడం రివాజయింది.

మొఘలే ఆజం సినిమాలో అప్పట్లో నాకు భయంకరంగా అనిపించిన పాట పాడినది బడే గులాం ఆలీఖానుది. నేను ఆరాధించే బాపూ రమణలకు – ఆ మహా విద్వాంసుడి పాటలంటే అంతా ఇంతా అనలేని ఇష్టం.

ఇంకా షంషాద్ బేగం, ఎస్డీ బర్మన్ వగైరాల గొంతుల విషయంలో కూడా చిన్నప్పుడు నాకు బాగా అసహనముండేది. అదంతా ఎందుకు, మరీ బాగా నచ్చిన పాటల్ని బాత్రూంలో కూడా పాడుకునేవాణ్ణి కాదు – నా గొంతు నచ్చక!

లోకో భిన్న రుచిః! భిన్నమైనంత మాత్రాన ఆ రుచులూ, అభిరుచులూ గొప్పవీ కావు, చెత్తవీ కావు. గొంతుల విషయంలో నా అభిరుచి ఏమాత్రం ఉత్తమం కాకపోవచ్చనడానికి కొన్ని నిదర్శనాలు చెప్పానంతే!

బాబాగారి పాటలకు సంబంధించి, ఆ గొంతు నచ్చడానికి భక్తి అత్యవసరమని నాకనిపించింది. ఐతే ఆ పాటల వరుసలు నాకే కాదు, పిల్లలతో సహా అందరికీ నచ్చాయి.

పాప సంగీతప్రియురాలు కాబట్టి – ఒకసారి వినగానే సంగీత సాహిత్యాలు పట్టేసి, రికార్డింగు ఔతూండగానే ఆ పాటల్ని తనూ పదే పదే పాడ్డం మొదలెట్టింది.

'గోవింద కృష్ణజై గోపాల కృష్ణజై గోపాల బాల రాధాకృష్ణజై' అని ప్రతి అక్షరం స్పష్టంగా పలుకుతూ, 'కృష్ణజై కృష్ణజై కృష్ణ కృష్ణ కృష్ణ కృష్ణజై' అని చక్కగా ముక్తాయించింది.

అక్కనే అనుసరించే బాబు మొత్తం పాటంతా పాడలేక, చివర్లో అందుకుని, 'కిత్తజై కిత్తజై కిత్త కిత్త కిత్త కిత్తజై' అని పాడేశాడు.

పాప స్పష్టంగా పాడిందానికంటే, బాబు ముద్దమాటల పాటకి మేము పరవశించిపోయి వాణ్ణి దగ్గరగా తీసుకుని ముద్దులాడేశాం.

అలా పిల్లల్ని కూడా ఆకర్షించి ఆకట్టుకుంటున్న పాటలవి.

"మీరు గొంతు అనొద్దంటే గొంతు అనను. రికార్డింగు పూర్తి కాగానే ఆ పాటల్ని మన టేపులో కూడా విందాం" అంది శ్రీమతి.

అది నా అనుమానమే కావచ్చు. కానీ శ్రీమతి గొంతులో ఆ పాటలపట్ల భక్తిభావం ధ్వనించింది. చురుగ్గా చూసి, "ఎందుకు?" అన్నాను.

"రికార్డింగప్పుడు కబుర్లెక్కువయ్యాయి. పిల్లలు గొంతు కలపడం మరొకటి. ఇప్పుడు కాసేపు శ్రద్ధగా విందాం. అదీకాక రావుగారిచ్చింది మామూలు కాసెట్టు. మనం రికార్డింగు చేసింది, స్వాల్లో స్టీరియో రికార్డర్లో. క్వాలిటీ మెరుగౌతుంది" అంది శ్రీమతి.

నాకది సంజాయిషీలా అనిపించింది. అసలు కారణం – ఆమెలో కొత్తగా ప్రవేశించిన భక్తిభావమేనని నిర్ణయానికొచ్చాను.

చిన్నప్పట్నించీ కూడా భక్తి అంటే నాకు కొంత అసహనం ఉండేది. భక్తి పేరిట – కొందర్ని తక్కువ చేసి దూరంగా ఉంచడం, స్వార్థమే పరమావధిగా మసలడం, అహంకారంతో ప్రవర్తించడం, మూర్ఖత్వాన్ని సమర్థించడం చాలామంది పెద్దల్లో ఉండేది,

ఆ భక్తి కారణంగానే ఆ పెద్దలు ప్రత్యేక గౌరవం పొందేవారు. మళ్లీ వారే రాజారామమోహనరాయ్, మహాత్మాగాంధీ, వివేకానందుడు, కందుకూరి వీరేశలింగం వగైరా సంఘసంస్కర్తల్ని ప్రస్తావించి – ఆదర్శపురుషులుగా అభివర్ణించేవారు.

అన్నీ తెలిసినా – సంప్రదాయం అలవర్చిన భక్తి వారి విపరీత ప్రవర్తనకు కారణమౌతోందని మా తాతగారనేవారు.

అలాంటి భక్తికి లోను కాకుండా శ్రీమతిని ఆపాలి అనుకుంటూ, అందుకు మార్గం ఆలోచిస్తున్నాను,

రికార్డింగు పూర్తయింది. మా రికార్డరు ప్లే చెయ్యగానే, మెరుగైన క్వాలిటీతో పాటలు మొదలయ్యాయి.

శ్రీమతి, పాప ప్లేయర్ ఎదుటనే కూర్చుని శ్రద్ధగా వింటున్నారు. బాబు అటూ ఇటూ తిరుగుతూ తన ధోరణిలో తానుండి మధ్యమధ్య పాటలు వింటున్నాడు.

కాసేపటికి నాకు విసుగొచ్చి, "ఎంతసేపని వింటారు? పాటలు ప్లే ఔతుంటాయి. ఇలా రండి, కబుర్లు చెప్పుకుందాం" అన్నాను.

"ఇప్పుడీ పాటలు ఇంకా బాగున్నాయి. ఎక్కడైనా రికార్డింగు సరిగ్గా లేకపోతే కూడా తెలుస్తుంది. మీరూ వినండి" అంది శ్రీమతి.

ఆమె గొంతులో భక్తిభావం ధ్వనించి నాలో అసహనం రేగింది. వెంటనే, "నాకొక్కటే ఆశ్చర్యంగా ఉంది. భక్తులు బాబాని మన పురాణాల్లో దేవుడితో పోలుస్తారు. ఆయనకు చెప్పలేనన్ని మహిమలున్నాయని అంటారు. అందుకు ఎన్నో నిదర్శనాలు చెబుతారు. నావరకూ, ఆయన పట్ల ఏమాత్రం ఆసక్తి లేదు. ఆయన దైవత్వాన్ని ఏమాత్రం నమ్మను. ఆయన నిజంగా దేవుడైతే, ఆయన గొంతు మనింట్లో పలక్కూడదు" అన్నాను.

నా మాటలు నాకే అసందర్భంగా తోచాయి. కానీ ఎందుకో ఆ క్షణంలో నా గొంతులో అదో రకమైన కసి!

అంతే!

ఆశ్చర్యంగా టేపులో పాట ఆగిపోయింది. ఏమయిందా అని అటు చూస్తే – టేపు తిరుగుతోంది. పాట రావడం లేదు.....

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments